సూర్య నేటి దినపత్రిక www.suryaa.com
18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
4PM www.suryaa.com
శనివారం 23 నవంబర్ 2024
పేజీలు: 02


**జార్ఖండ్ 81/81**

| | |
|---|---|
| BJP | 29 |
| CONG | 51 |
| OTH | 01 |

**మహారాష్ట్ర 288/288**

| NDA 217 | | MVA 48 | | MIM | OTH |
|---|---|---|---|---|---|
| BJP | 125 | CONG | 21 | 01 | 16 |
| SS(S) | 54 | SS(UT) | 20 | | |
| NCP (AP) | 38 | NCP (SP) | 13 | | |



# మహారాష్ట్రలో ఎన్డీయే డబుల్ సెంచరీ

మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయఢంకా మోగించబోతోంది. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాల సరళిని బట్టి మహాయుతి కూటమి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 216 స్థానాల్లో ముందంజలో ఉంది. మరో నాలుగు స్థానాల్లో గెలుపు ఖరారైంది. ఇక ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి కేవలం 52 స్థానాల్లో మాత్రమే ముందంజలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమి నేతలు సంబరాలు షురూ చేశారు. సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, ఇతర కీలక నేతల నివాసాలు, పార్టీ కార్యాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. కార్యకర్తలు ఢోలు వాయిస్తూ, పటాసులు కాలుస్తూ సందడి చేస్తున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ గెలుపును సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

**షిండేనా.. ఫడ్నవీసా..**
**మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరు..?**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. మొత్తం 288 స్థానాలకు గానూ 220 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న తరుణంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూటమిలోని పెద్ద పార్టీ అయిన బీజేపీనే ఈ సారి సీఎం పదవి చేపడుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. కూటమిలో బీజేపీకే అత్యధిక సీట్లు వచ్చాయి. మొత్తం 220 స్థానాల్లో బీజేపీ 128 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. దీంతో ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీసే బీజేపీ తరఫున మహా తదుపరి సీఎం అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఫడ్నవీస్ మద్దతుదారులు సైతం ఇదే డిమాండ్ చేస్తున్నారు.



**ఫడ్నవీసే మహా తదుపరి సీఎం..**

మహారాష్ట్ర తదుపరి సీఎంగా ఫడ్నవీసే బాధ్యతలు చేపడతారంటూ బీజేపీ నేత ప్రవీణ్ దకేకర్ కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో మహా తదుపరి సీఎంగా ఫడ్నవీసే ఖాయంగా తెలుస్తోంది. ఇదే విషయమైన ఫడ్నవీస్ తల్లి సరితా ఫడ్నవీస్ స్పందించారు. కచ్చితంగా తన కుమారుడే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేవేంద్ర ఫడ్నవీస్ 24 గంటలూ కష్టపడి పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తన కుమారుడు పెద్ద నాయకుడిగా ఎదిగినందుకు సంతోషంగా ఉందన్నారు.

**సీఎం ఎవరనేది**
**కూర్చుని నిర్ణయిస్తాం : ఏక్‌నాథ్ షిండే**

మరోవైపు ఏక్‌నాథ్ షిండేనే మహారాష్ట్ర తదుపరి సీఎం అని ఆయన వర్గం స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో సీఎం ఏక్‌నాథ్ షిండే మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. అధికార కూటమికే మళ్లీ పట్టం కట్టిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ సీఎం మీరే అవుతారా అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. కూటమిలోని మూడు పార్టీల నేతలం కూర్చుని సీఎం ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పారు. ఈసారి పెద్ద పార్టీ అయిన బీజేపీ సీఎం పదవి చేపడుతుందా..? అని మీడియా ప్రశ్నించగా 'కూటమిలోని పెద్ద పార్టీయే సీఎం పదవి చేపట్టాలనే రూల్ ఏం లేదుగా..!' అని షిండే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సీఎం సీటు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గెలుపు సంతోషం కంటే కూటమికి నేతలకు సీఎం అభ్యర్థి ఎంపికే కష్టతరంగా మారబోతోందంటూ చర్చించుకుంటున్నారు.

**ముంబైకి కేంద్ర పరిశీలకులు**

మరోవైపు ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ అగ్రనాయకత్వం రేపు ముంబైకి కేంద్ర పరిశీలకులను పంపనున్నట్లు తెలిసింది. వారు కూటమి పార్టీలతో చర్చలు జరపనున్నారు. కూటమిలోని మూడు పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే సీఎం ఎవరన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**26న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం..**

మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఈనెల 25న లెజిస్లేటివ్ పార్టీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో సీఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఆ తర్వాతి రోజు అంటే ఈనెల 26న కొత్తసీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.



## జార్ఖండ్‌లో ఇండియ కూటమి హవా
# జార్ఖండ్‌లో మళ్లీ హేమంత్‌కే పట్టం

జార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులయ్యాయి. అక్కడి ప్రజలు మళ్లీ హేమంత్ సోరెన్(జేఎంఎం) నేతృత్వంలోని ఇండియా కూటమికే పట్టం కట్టారు. దీంతో ఎలాగైనా అక్కడ అధికార పీఠాన్ని దక్కించుకోవాలన్న కమలనాథుల ఆశలు అడియాశలయ్యాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఇప్పటి వరకు ఉన్న కౌంటింగ్ ట్రెండ్స్ మేరకు మొత్తం 81 అసెంబ్లీ స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 50 స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. అక్కడ మ్యాజిక్ ఫిగర్ 41 గా ఉంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అభ్యర్థులు 29 స్థానాల్లో ముందంజలో ఉన్నారు. రెండు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. లేటెస్ట్ ట్రెండ్స్ మేరకు జార్ఖండ్‌లో మళ్లీ హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఏర్పడే అవకాశముంది. జార్ఖండ్‌లో శనివారం (23 నవంబర్, 2024) ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. గత 24 ఏళ్ల రికార్డును హేమంత్ సర్కార్ బ్రేక్ చేశారు. ప్రతి ఐదేళ్లకు అక్కడ ప్రభుత్వాన్ని మార్చుతున్నారు ఓటర్లు. ఏ పార్టీ వరుసగా రెండోసారి అధికార పగ్గాలు సొంతం చేసుకోలేదు. అయితే ఈ సారి వరుసగా రెండోసారి అధికారాన్ని సొంతం చేసుకునే దిశగా హేమంత్ సోరెన్ దూసుకుపోతున్నారు. హేమంత్ సోరెన్ బర్హైత్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గామ్లియెల్ హెంబ్రోమ్‌పై 2,812 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అక్కడ బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనావేశాయి. అయితే యాక్సిస్ మై ఇండియా మాత్రం ఇండియా కూటమి విజయం సాధిస్తుందని అంచనావేసింది. ఇండియా కూటమికి 53 సీట్లు, ఎన్డీయేకి 25 సీట్లు దక్కే అవకాశముందని తెలిపింది.

జేఎంఎం కూటమికి అనుకూలించిన అంశాలు..

జార్ఖండ్‌లో జేఎంఎం కూటమి విజయానికి రెండు అంశాలు కలిసొచ్చాయి. జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి ఈ రెండు కూడా ఎన్నికల్లో బ్రహ్మాస్త్రాలుగా పనిచేశాయి. ఇందులో ఒకటి సీఎం మయ్యా యోజన కింద మహిళలకు నెలకు రూ.2వేల 500 సాయంతో పాటు.. హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపడం కూడా ప్రజల్లో సెంటిమెంట్ రాజేసింది. దీంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి 51 సీట్ల మెజార్టీ ఇచ్చారు జార్ఖండ్ ప్రజలు.





# రికార్డులు బద్దలు కొడుతోన్న ప్రియాంక..
## ఇందిరమ్మ మనవరాలికి వయనాడ్ పట్టాభిషేకం

తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన ప్రియాంక గాంధీ వాద్రా తిరుగులేని ఆధిక్యంతో దూసుకుపోతున్నారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్ సైట్ ప్రకారం.. ఈ వార్త రాస్తున్న సమయానికి కేరళలోని వయనాడ్ పార్లమెంట్ స్థానంలో ఆమె మెజార్టీ ప్రస్తుతం 3 లక్షలు దాటింది. ప్రస్తుతం ప్రియాంక గాంధీ 3.19 లక్షల ఓట్లకు పైగా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆమె తర్వాతి స్థానాల్లో సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరి, బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ ఉన్నారు. వయనాడ్‌లో గెలవడం కాదు.. ఏకంగా 5 లక్షల మెజారిటీ రావాలనే లక్ష్యంతో ప్రచారం చేశారు. స్వయంగా సోనియా గాంధీనే ప్రచారానికి వచ్చారు. వయనాడ్ ఉప ఎన్నికలో మొత్తం 16 మంది అభ్యర్థులు పోటీకి దిగారు. 16 మంది పోటీలో ఉన్నా.. అదంతా నామమాత్రమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అందుకు తగ్గట్టే.. భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నారు ప్రియాంక. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3 లక్షల మెజార్టీతో రాహుల్ గెలిచిన రాహుల్.. మొన్నటి ఎన్నికల్లో వయనాడ్ నుంచి సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3 లక్షల 60వేల మెజారిటీతో గెలిచారు రాహుల్‌గాంధీ. ఇప్పుడు అంతకంటే ఎక్కువ మెజారిటీ సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పైగా ప్రియాంకగాంధీ మొదటిసారి ఎన్నికల బరిలో ఉండడంతో.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేశాయి. ఎగ్జిట్ పోల్స్ కూడా వయనాడ్‌లో ప్రియాంక ఈజీ విక్టరీ సాధిస్తారని తేల్చాయి. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోసారి రాహుల్‌గాంధీ గెలిచారు. అయితే.. రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీలో కూడా గెలవడంతో.. వయనాడ్‌ను వదులుకున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

ఆనంద్ ఐ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్‌లో దారుణం

## కంటిలో నలకపడిందని వస్తే సర్జరీ అన్నారు..

# చిన్నారి మృతి!

వైద్యం కోసం వచ్చిన చిన్నారి అన్విక (5)మృతి. కంటి లో నలుక పడిందని హాస్పటల్ కి తీసుకొచ్చిన తల్లిదండ్రులు. కంటిలో నలుకను తీసేయాలంటే సర్జరీ చేయాలని సూచించిన వైద్యులు. సర్జరీ చేసేముందు పాప అన్వికకు మత్తు ఇంజక్షన్ ఇచ్చారు మత్తు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే పాప హార్ట్ ఆగిపోయింది. హార్ట్ బీట్ ఆగిపోవడంతో అన్విక ను ఎల్బీనగర్ రెయిన్ బో హాస్పిటల్ తల్లిదండ్రులకు తెలియకుండానే తరలించారు. రెయిన్ బో హాస్పిటల్ వైద్యులు పాప స్పృహలో లేదని నిర్ధారించారు, పాపను తీసుకువెళ్లాలని బంధువులకు సూచించారు.

విషాదం.. శ్రీ చైతన్య కాలేజీలో

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లాల్సిన విద్యాలయాలు మృత్యు నిలయాలుగా మారుతున్నాయి. శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ ధనదాహం, మార్కుల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల ఒత్తిడిని తట్టుకోలేక ఎంతో మంది వద్యార్థులు తమ ప్రాణాలను బలితీసుకుంటున్నారు. తాజగా శ్రీ చైతన్య కాలేజీలో విషాదం చోటు చేసుకుంది. హాస్టల్ గదిలో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన మియాపూర్ శ్రీ చైతన్య బాయ్స్ జూనియర్ కాలేజీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కౌశిక్ రాఘవ(17) అనే విద్యార్థి ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధ రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. విద్యార్థి మృతిని కాలేజీ యాజమాన్యం గోప్యంగా ఉంచారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కాలేజీ ముందు ఆందోళన చేపట్టారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఐపీఎల్ 2025 మార్చి 14న

# ఐపీఎల్ స్టార్ట్

క్రికెట్ అభిమానులను గత 17 సీజన్లుగా అలరిస్తున్న క్యాష్ రిచ్ లీగ్ ఐపీఎల్‌లో రాబోయే మూడేండ్ల షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది. సాధారణంగా ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి కొద్ది రోజుల ముందు తేదీలను వెల్లడించే సంప్రదాయానికి చెక్ పెడుతూ.. వచ్చే మూడు సీజన్లకు సంబంధించిన తేదీలను ఫ్రాంచైజీలతో పంచుకుంది. వచ్చే ఏడాది ఐపీఎల్ మార్చి 14న మొదలై మే 25తో ముగియనుంది. 2026లో మార్చి 15 నుంచి మే 31తో జరుగబోయే ఈ మెగా లీగ్.. 2027లో మార్చి 14న ప్రారంభమై మే 30 దాకా సాగుతుందని పేర్కొంది. 2026, 2027 ఎడిషన్లలో లీగ్ మ్యాచ్‌ల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశముంది. ఐపీఎల్‌లో గత కొంతకాలంగా విదేశీ ఆటగాళ్ల ఇతర ఒప్పందాలు ఈ లీగ్ షెడ్యూల్‌తో క్లాష్ అవుతున్నాయని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బీసీసీఐ.. రాబోయే మూడేండ్లకూ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించింది.



చర్లపల్లి జైల్లో పట్నం నరేందర్ రెడ్డితో

# కేటీఆర్ ములాఖత్

చర్లపల్లి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాఖత్ అయ్యారు. లగచర్ల కేసులో పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కేటీఆర్ వెంట పట్నం నరేందర్ రెడ్డి భార్య, శ్రీనివాస్ గౌడ్, మహముద్ అలీ, బండారు లక్ష్మారెడ్డి ఉన్నారు. ఇక లగచర్లలో అధికారుల కార్యక్రమంలో రైతులు దాడి చేశారంటూ బొంరాస్‌పేట పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లను ఎందుకు నమోదు చేశారో పూర్తి వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఒక నేరానికి సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పట్నం నరేందర్ రెడ్డి తరపున ఆయన భార్య శృతి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ విచారించారు.




# కేకే మళ్లీ గెలిచాడు

## మహారాష్ట్ర సర్వేలో సత్తా చాటిన తెలుగోడు

కేకే ఈ పేరు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో మారుమోగింది. హర్యానా ఎన్నికల ఫలితాల తర్వాత కేకే సర్వే తప్పడంతో ఆయన సర్వేలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గాలి లెక్కలు చెబుతున్నారంటూ కేకేపై ఎన్నో విమర్శలు వెల్లువెత్తాయి. హర్యానాలో కేకే సర్వే తప్పడంతో ఆయన కుంగిపోలేదు. లోపాలను సరిచేసుకుని, మహారాష్ట్రలో సరైన అంచనాలతో ముందుకొస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. హర్యానాతో పాటు తరువాత జరిగే అన్ని ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ తగ్గుతుందని ముందే చెప్పారు. దీంతో మహారాష్ట్రలో కేకే సర్వే ఎలాంటి అంచనాలను ప్రకటిస్తుందోనని అంతా ఎదురుచూశారు. అనూహ్యంగా జాతీయస్థాయిలో ఏ సర్వే సంస్థ ఇవ్వని విధంగా మహారాష్ట్రలో 225 స్థానాల్లో మహాయుతి కూటమి గెలుస్తుందని కేకే ప్రకటించారు. రాసిపెట్టుకోండి తన సర్వే అక్షరాలా సత్యం అంటూ ధీమా వ్యక్తం చేశారు.

**లీడ్‌లో మహాయుతి కూటమి**

ఓట్ల లెక్కింపు మొదలుపెట్టినప్పటి నుంచి మహాయుతి కూటమి ఆధిక్యాన్ని కనబరుస్తూ వచ్చింది. ఉదయం 11 గంటల వరకు అందిన ఫలితాల ప్రకారం మహాయుతి కూటమి 220 స్థానాల్లో ఆధిక్యం కనబరుస్తుండటంతో మరోసారి కేకే పేరు జాతీయస్థాయిలో మారుమోగుతోంది. మహారాష్ట్ర ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించిన సంస్థల్లో కొన్ని గరిష్టంగా మహాయుతి కూటమికి 180 నుంచి 190 స్థానాలు ఇవ్వగా కేకే మాత్రం 225 స్థానాలు మహాయుతి గెలుస్తుందని విశ్వాసంతో చెప్పారు. మహారాష్ట్ర ఫలితాలు కేకే సర్వేకు దగ్గరగా ఉండటంతో కేకే సర్వేపై మరోసారి చర్చ మొదలైంది. ఏపీ అసెంబ్లీలో ఎగ్జిట్‌పోల్స్‌తో వార్తల్లో నిలిచిన కేకే.. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇచ్చిన అంచనాలు దగ్గరగా ఉండటంతో కేకే సర్వేపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**ఏపీలో ఎగ్జాట్ ఫిగర్..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఏ సర్వే సంస్థ వెల్లడించని విధంగా కేకే సర్వే 160కి పైగా స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని వెల్లడించారు. అదే సమయంలో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో ఆ పార్టీ గెలుస్తుందని కేకే తెలిపారు. కేకే అంచనాలకు తగిన విధంగా వాస్తవ ఫలితాలు రావడంతో ఆయన సర్వే తీవ్ర సంచలనమైంది. మహారాష్ట్ర ఫలితాలు చూస్తుంటే కేకే సర్వేకు దగ్గరగా ఉండటంతో జాతీయ స్థాయిలో ఆయన సర్వే మరోసారి సంచలనంగా మారింది.

# సెమీస్‌కు సాత్విక్ జోడీ



భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్-చిరాగ్ చైనా మాస్టర్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలి టోర్నీ ఆడుతున్న ఈ మాజీ ప్రపంచ నంబర్‌వన్ జోడీ.. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో 21-16, 21-19తో కిమ్ అస్త్రుప్-ఆండర్స్ స్కరుప్ (డెన్మార్క్)ను చిత్తుచేసింది. 47 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో సాత్విక్-చిరాగ్ ఆది నుంచీ ఆధిపత్యం చెలాయించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 18-21, 15-21తో అండర్స్ అంటోన్సెన్(డెన్మార్క్) చేతిలో ఓటమిపాలయ్యాడు. లక్ష్యసేన్ నిష్క్రమణతో సింగిల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది.





ఆస్ట్రేలియా 104 ఆలౌట్..

# బుమ్రాకు 5 వికెట్లు

భారత్‌తో పెర్త్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 104 రన్స్‌కు ఆలౌటైంది. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో రోజు ఇవాళ ఉదయం భారత పేసర్ బుమ్రా రఫాడించాడు. ఆసీస్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లలో త్వరత్వరగా వెనక్కి పంపించాడు. బుమ్రా తొలి ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు తీసుకున్నాడు. టెస్టుల్లో బుమ్రా 5 వికెట్లు తీసుకోవడం ఇది 11వ సారి. మరో బౌలర్ హర్షిత్ రాణాకు మూడు వికెట్లు దక్కాయి. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై.. ఆస్ట్రేలియా బ్యాటర్లు కూడా తడబడ్డారు. అయితే మిచెల్ స్టార్క్ మాత్రం కాసేపు భారత బౌలర్లను పరీక్షించాడు. 112 బంతులు ఆడిన స్టార్క్.. వ్యక్తిగతంగా 26 రన్స్ చేసి ఔటయ్యాడు. స్టార్క్ వికెట్‌కు అతుక్కుపోవడంతో.. భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. స్టార్క్, హేజిల్ వుడ్‌లు పదో వికెట్‌కు 110 బంతుల్లో 25 రన్స్ జోడించారు. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే.

**స్థిరంగా ఆడుతున్న కేఎల్ రాహుల్, జైస్వాల్.. ఇండియా 96/0**


ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో.. ఇండియన్ ఓపెనర్లు నిలకడగా బ్యాటింగ్ చేస్తున్నారు. వేగంగా స్కోర్ చేయకున్నా.. చాలా ఓర్పుతో ఆసీస్ స్పీడ్ బౌలర్లను ఎదుర్కొంటున్నారు. ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 75 రన్స్ చేసింది. జైస్వాల్ 47, రాహుల్ 40 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు భారత్‌కు ఆధిక్యం 142 రన్స్‌కు చేరుకున్నది.




‘విరుపాక్ష’ దర్శకుడితో కొత్త సినిమా

# ప్రారంభించిన నాగ చైతన్య

స్టార్ హీరో అక్కినేని నాగచైతన్య కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. సాయి ధరమ్ తేజ్‌కి విరుపాక్ష లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు కార్తీక్ వర్మ దర్శకత్వంలో చైతూ సినిమా చేయబోతున్నాడు. నేడు నాగ చైతన్య పుట్టినరోజు కానుకగా ఈ ప్రాజెక్ట్‌ను ఆఫీషియల్‌గా అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డేను తీసుకోబోతున్నారని టాక్ నడుస్తుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లపై బోగవల్లి ప్రసాద్‌తో పాటు సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# బోల్డ్ ఫోటోలతో రకుల్

రకుల్ ప్రీత్ సింగ్.. టాలీవుడ్ టాప్ హీరోయిన్స్ లోఒకరు .. వేంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైనా ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది.గోపి చంద్ తో లౌక్యం, మంచు మనోజ్ తో కరెంట్ తీగ, రామ్ తో తో పండగ చేసుకో సినిమాలు చేసి మంచి స్టార్ డం సంపాదించిన రకుల్ ప్రీత్ ఆతర్వాత వరుసగా స్టార్ హీరోల సరసన నటించింది.రామ్ చరణ్ నుంచి నాగ చైతన్య వరకు అందరితో వరుస పెట్టి సినిమాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు రకుల్ అదే టాలీవుడ్ నుంచి ఒక ఆఫర్ కోసం ఎదురు చూస్తుంది. చివరిగా ఈ బ్యూటీ తెలుగులో 'భారతీయుడు 2 సినిమా' చేసింది. మధ్యలో బూ అంటూ హార్రర్ సినిమాతో పలకరించింది. నేరుగా ఓటీటీలో రిలీజైన ఈ సినిమాకు పెద్దగా ఆడియెన్స్ నుంచి రెస్పాన్స్ రాలేదు. ఇక ఈ ఏడాది 'అయలాన్' సినిమాతో పలకరించింది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరీ 21న గోవాలో తన లాంగ్ టైమ్ బాయ్ ఫ్రెండ్ జాకీ భగ్నానీని ఘనంగా పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా నటిగా కెరీర్‌ను కొనసాగిస్తుంది.